**కథ**

# అలవాట్లో పొరపాటు

**రాజు ఏడవ తరగతి పాసయ్యాడు. ఆ ఊళ్లో ఎనిమిదో తరగతి చదవడానికి స్కూలు లేదు. అందుకే వాళ్ల నాన్న రాజును తాతగారింట్లో విడిచిపెట్టి వెళ్లాడు.**

తాతగారిల్లు పెద్దలోగిలి. ఉమ్మడి కుటుంబం. కుటుంబ సభ్యులు పాతికమంది పైనే వుంటారు. పాలేళ్లకు, పనిమనుషులకు మొత్తం జనాభా అంతటికీ ఆ ఇంటిలో నిత్యాగ్ని హోత్రంలా పొయ్యి మండుతూనే వుంటుంది. ఇల్లు వచ్చేపోయే మనుషులతో కళకళలాడుతూ వుంటుంది. అంత పెద్ద ఇంటి నిర్వహణ బాధ్యతలు రాజు అమ్మమ్మ పున్నమ్మగారే నిర్వహిస్తుంది. ఆమె మాట ఆ ఇంటిలో వారందరికీ వేదవాక్కు.

తల్లిని విడిచి వచ్చిన రాజుకు పున్నమ్మ ఎటువంటి లోటూ రానిచ్చేది కాదు. పిల్లల్లో వాడిపట్ల ప్రత్యేకత కనబరిచేది. అమ్మమ్మంటే రాజుకు విపరీతమైన అభిమానం, ఆమె మాటపై గురి ఏర్పడ్డాయి రాజుకు. ఆ ఇంట్లోని జనాభాలో అక్షరాస్యుల సంఖ్య చాలా తక్కువ. కాని రాజు చదువుకు చాలా సమయాన్ని కేటాయించేవాడు.

పున్నమ్మ ఛక్తు సంప్రదాయ కుటుంబంలోంచి వచ్చిన స్త్రీ. దైవభక్తి ఎక్కువ. పురాణాల్లో నీతులు ఆమెలో జీర్ణించుకున్నాయి. కాలం మారినా ఆమె ఆలోచనలు మార లేదు. రాజు తల్లీ, తండ్రీ అప్పుడప్పుడూ వచ్చి కొడుకును చూసి వెళుతుండేవారు.

వేసవి వచ్చింది. మామిడి, మల్లెల తోబాటు కోకిల గానాలూ వచ్చాయి. రాజు పాలిట పాడు పరీక్షలు కూడా వచ్చాయి. రాత్రనకా, పగలనకా పుస్తకాలతో కుస్తీపట్టి రాజు పరీక్షలు రాశాడు. ''ఎలా రాశావురా పరీక్షలు అల్లుడా?'' అంటూ మావయ్యలు అడిగితే ''బాగానే రాశాను! క్లాసు వస్తుంది'' అని చెప్పాడు రాజు.

''నా తండ్రే! నా మనవడు పాసవ్వకపోతే మరెవరు పాసౌతారు! నాదిష్టి, నీ దిష్టి, ఊళ్లోవాళ్ల దిష్టీ పోను!'' అంటూ పిడికెడు ఎండు మిరపకాయలు, ఉప్పు దిష్టితీసి పొయ్యిలో వేసింది పున్నమ్మ. రాజు పరీక్షలు అయిపోయాక వాళ్ల ఊరు వెళ్లిపోయాడు.

పరీక్షా ఫలితాలు వచ్చాయి! విచిత్రం! రాజు పరీక్షలు తప్పాడు!

రాజు మేనమామలు గతుక్కుమన్నారు! అంత కష్టపడి చదివిన రాజు పరీక్ష తప్పడం, వాళ్లకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ విషయం అక్కాబావలకు తెలిస్తే వాళ్లేమనుకుంటారు? అల్లుడి పరీక్ష పోవడంతో వారికి తలకొట్టేసినంత పనయింది.

వారిలో చినమామయ్య పరమ మూర్ఖుడు! పెద్దగా చదువుకోలేదు. ''రాజును కావాలనే పంతుళ్లు ఫెయిల్ చేశారు! వాళ్లరక్తాన్ని కళ్ల జూస్తాను'' అంటూ కొడవలి పట్టుకుని ఉద్రేకంతో స్కూల్‌వైపు మాస్టార్లపై దాడికి బయల్దేరాడు.

''ఇంత చదువుకుని పక్షపాతంతో వ్యవహరిస్తార్రా!..సరస్వతీ పుత్రుడ్ని ఫెయిల్ చేస్తార్రా?..మీ రక్తం కళ్లజూడందే ఇక్కడినుంచి కదలను..రండిరా బయటకు!''.

అంతలో స్కూల్ హెడ్‌మాస్టరు గదిలోంచి బయటకు వచ్చారు. చినమావయ్యను శాంతపరచి, గ్లాసుతో మంచి నీళ్లు ఇచ్చి, అతను చల్లబడ్డాక అసలు విషయాన్ని అడిగి తెలుసుకున్నారు హెడ్‌మాస్టర్.

రాజుకు సైన్స్, సోషల్ సబ్జెక్టులో మార్కులు చాలా



తక్కువ వచ్చాయి. మిగతా సబ్జెక్ట్సులో మాత్రం మార్కులు బాగానే వచ్చాయి.

సైన్సు, సోషల్ స్టడీస్ బోధించిన మాస్టార్ల అంతు చూస్తానంటూ ఎగిరిపడ్డాడు చినమావయ్య.

చిన్నోడు వెళ్లి స్కూల్లో చిచ్చుపెట్టి వుంటాడని మిగతా మావయ్యలు పరుగు పరుగున స్కూల్ దగ్గరకు చేరారు. వాళ్లందర్నీ సమావేశ పరచి, స్కూల్ హెడ్ మాస్టర్ రాజు రాసిన సైన్స్, సోషల్ పేపర్లు తీయించాడు. మంచి దస్తూరితో చూడముచ్చటగా రాశాడు రాజు ఆ పేపర్లలో. చూడ్డానికి ముచ్చటగానే వున్నాయి గాని..సబ్జెక్ట్ చూసేసరికి హెడ్‌మాస్టర్‌కు కళ్లు తిరిగాయి! దిద్దిన పేపర్లలో ఎర్ర పెన్సిల్‌తో అండర్ లైన్ చేసిన వాక్యాలు చూసి ఆగారాయన.

ఆర్యుల ఆచార వ్యవహారాల గురించి రాస్తూ రాజు–

''ఆర్యులు దైవభక్తిగలవాళ్లు. రాళ్లను, తాళ్లను పూజించెడి వారు' అని వుంది. ఆ వాక్యాలు చదివి హెడ్‌మాస్టరు ఉలిక్కిపడ్డారు.

'ఆర్యులు వ్యవసాయం చేసెడివారు. పండుగలు జరుపుకునేవారు. వంటికి 'నీళ్లు' బాగా పట్టించి అభ్యంగన స్నానమాచరించేవాళ్లు'' అని సోషల్ పేపర్లో రాశాడు రాజు. హెడ్‌మాస్టరుకు కళ్లు తిరుగుతున్నాయి.

సైన్స్‌పేపర్ తీశాడు. ''ఆకాశంలో ఉరుములు, మెరుపులకు కారణం, ఇంద్రుడు వజ్రాయుధంతో దాడి జరపడం! పూర్వం కొండలకు రెక్కలుండేవి, వాటి సహాయంతో అవి ఎగురుతుండేవి. ఎక్కడ కనబడితే అక్కడ దిగి జననష్టం కలిగించడంతో, ఇంద్రుడు వాటి రెక్కల్ని నరకి జనాన్ని రక్షించాడు. ఉరుములు ఉరిమినప్పుడు అర్జునా..ఫల్గుణా..పార్థా..అంటూ స్మరిస్తే మనపై పిడుగులు పడవు!..సూర్యుడు ఏక చక్రరథంపై భూమి చుట్టూ తిరుగుతుండడం వలన మనకు రాత్రులూ, పగళ్లూ ఏర్పడుతున్నాయి! సూర్యచంద్రులను రాహుకేతువులనే రాక్షసులు మింగడం వల్ల మనకు సూర్యగ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడుచున్నాయి...అని ఆ పేపర్లో ప్రశ్నలకు సమాధానాలు రాశాడు రాజు.

ఇవన్నీ చదివి వినిపిస్తున్న హెడ్‌మాస్టారి గొంతు వణికింది! అంత తెలివైన రాజు ఇంత అజ్ఞానంతో ఎలా జవాబులు రాశాడో ఆయనకు అంతు పట్టలేదు.

ఇవన్నీ విన్న తరువాత మావయ్యలకు మతిపోయింది! ఇంత తెలివైనవాడు..రాత్రీ పగలనక చదివిన తమ మేనల్లుడు ఇలా అర్థం పర్థం లేని రాతలు రాయడం..వాళ్ల మెదడుకు తట్టలేదు. వారికి తలకొట్టేసినంత పనయింది! మారుమాటాడకుండా ఇద్దరూ వెనక్కి వెళ్లిపోయారు. .

వెంటనే రాజును గ్రామానికి రప్పించారు.

''ఏవిటా పిచ్చిరాతలు?'' ముక్తకంఠంతో ప్రశ్నించారు మావయ్యలు.

రాజు ఇచ్చిన సమాధానం విని ఆశ్చర్యపోవడం వాళ్లవంతయింది.

''రాత్రులు చదివినప్పుడు 'పాము', 'నూనె'ల వంటి పదాలను అలా పలకకూడదని, పాముకు బదులుగా 'తాడు' అని నూనెకు బదులుగా 'నీళ్లు' అంటూ పలకాలని అమ్మమ్మ చెప్పింది. అలాగే మెరుపులు గ్రహణాల గురించి కూడా పుస్తకాల్లో రాసింది తప్పు అని అమ్మమ్మ చెప్పింది. అలవాట్లో పొరపాటుగా వాటినే రాశాను'' బదులిచ్చాడు రాజు.

ఇంటి పెద్దగా బామ్మ బాధ్యతలు సక్రమంగానే నిర్వహిస్తోంది. పిల్లల చదువుల విషయంలో ఆమె జోక్యం లేకుండా చూడాలని ఆరోజు నిర్ణయించుకున్నారు రాజు మావయ్యలు ఆ క్షణంలోనే. ★

ఆనందరావు పట్నాయక్